క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: మడికొండలో ఈనెల 2న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. మడికొండ ఇండస్ట్రీయల్ ఏరియాలో ఉదయం 7.30గంటల నుంచి 11.30గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

గౌడ సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రెటరీగా వెంకటేశ్వర్ గౌడ్



హన్మకొండ: తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా జనగాం వెంకటేశ్వర్ గౌడ్‌ను నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్‌రావు గౌడ్ తెలిపారు. కొన్నేళ్లుగా గీత కార్మికుల సమస్యలపై పోరాటం చేస్తూ, సంఘం కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొంటున్న హనుమకొండ వడ్డెపల్లికి చెందిన వెంకటేశ్వర్ గౌడ్‌ను రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా నియమించినట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు. కాగా, తన నియామకానికి సహకరించిన సంఘం నాయకులకు వెంకటేశ్వర్ కృతజ్ఞతలు తెలిపారు.

గౌడ సంఘం జిల్లా అధ్యక్షురాలిగా పద్మ

ఖిలా వరంగల్: తెలంగాణ గౌడ సంఘం జిల్లా అధ్యక్షురాలిగా శంభునిపేట ప్రాంతానికి చెందిన 41వ డివిజన్ కార్పొరేటర్ పోశాల పద్మ నియమితులయ్యారు. ఈమేరకు హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆమెకు వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్‌గౌడ్ నియామక పత్రాన్ని శనివారం అందజేశారు.

కుమార్‌కు డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ గణితశాస్త్ర విభాగం పరిశోధకుడు రాగుల కుమార్‌కు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. న్యూమరికల్ మెథడ్స్ ఫర్ ఏ క్లాస్ ఆఫ్ సింగులర్లీ పర్టుర్బ్‌డ్ డిఫరెన్షియల్ డిఫరెన్స్ ఈక్వేషన్స్ అనే అంశంపై అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జీబీఎస్ఎల్ సౌజన్య పర్యవేక్షణలో సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి కుమార్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి తెలిపారు.

బాధిత కుటుంబానికి సాయం

హసన్‌పర్తి: ఫైనాన్స్ కంపెనీ వేధింపులకు తాళలేక ఇటీవల ఆత్మహత్య చేసుకున్న పలివేల్పులకు చెందిన సల్లా రాజా అంకూస్ కుటుంబాన్ని బీఆర్ఎస్ జిల్లా నాయకులు చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి 50 కిలోల బియ్యంతో పాటు నిత్యావసర వస్తువులు అందించారు. కార్యక్రమంలో పోతరబోయిన లోకేష్, ఎండీ.ఖాదర్‌బాబా, కొడారి నరేష్, అల్వాల రాజా, కొమురయ్య, సల్ల సుమన్, చిర్ర శ్రవణ్, సాంబయ్య, పైడి పాల్గొన్నారు.

కణితి తొలగింపు

హన్మకొండ చౌరస్తా: ఓ మహిళ కడుపులో నుంచి 5 సెంటీమీటర్ల కణితిని హనుమకొండలోని ముత్యం కిడ్నీ సెంటర్‌లో అధునాతన పద్ధతిలో శనివారం తొలగించారు. విజయవంతంగా ఆపరేషన్ చేసిన వైద్యులు బచ్చు చందుకృష్ణ, మన్నెం శ్రీనాథ్‌రెడ్డి, అనస్తీషియా కృష్ణ బృందం వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరానికి చెందిన 25 ఏళ్ల మహిళ సంతానలేమితో బాధపడుతోంది. సదరు మహిళకు ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించగా ఎడమ కిడ్నీలో 5 సెంటీమీటర్ల కణితి ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. దాన్ని తొలగించేందుకు పార్షియల్ నెఫ్రెక్టమీ అని పిలువబడే ప్రక్రియ ద్వారా 25 నిమిషాల పాటు కిడ్నీకి రక్త ప్రసరణను తాత్కాలికంగా నిలిపివేసి కణితిని తొలగించారు.

డాక్టర్ అజిత్‌కు షైనింగ్ స్టార్ ఎక్సలెన్స్ అవార్డు



హసన్‌పర్తి: లయన్స్ జిల్లా లీడర్‌షిప్ కోఆర్డినేటర్ డాక్టర్ అజిత్‌కుమార్‌ను షైనింగ్ స్టార్ ఎక్సలెన్స్ అవార్డుతో సన్మానించారు. జనగామ జిల్లా కేంద్రంలో శుక్రవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ కన్నా పరశురాములు, మల్టీపుల్ చైర్మన్ విద్యాసాగర్ చేతుల మీదుగా డాక్టర్ అజిత్‌కుమార్ అవార్డు అందుకున్నారు.

త్వరలో యువజన కాంగ్రెస్ కమిటీల నియామకం

వరంగల్: వరంగల్ తూర్పు యువజన కాంగ్రెస్ కమిటీల నియామకాలు త్వరలో పూర్తి చేస్తామని వరంగల్ తూర్పు యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ తెలిపారు. ఓసిటీ మైదానంలో శనివారం జరిగిన సమావేశంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రేపల్లె శ్రీనాథ్ మాట్లాడుతూ యువకులకు న్యాయం జరగాలన్నా, నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కాలన్నా వరంగల్ తూర్పులో కాంగ్రెస్ జెండా ఎగరాలని అన్నారు. ఆ దిశగా ప్రతీఒక్కరు కృషి చేయాలని కోరారు. సమావేశంలో వరంగల్ తూర్పు యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కమల్, సాయి, సన్నీ, లోకేష్, మొయిన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన గ్రూప్–4 పరీక్ష



శాయంపేట: అలస్యంగా వచ్చిన అభ్యర్థులను వెనక్కి పంపిస్తున్న పోలీస్‌లు



కమలాపూర్: పరీక్ష కేంద్రంలోకి అనుమతించాలని ఏసీపీని వేడుకుంటున్న అభ్యర్థులు

పరకాల: పట్టణంలోని వివిధ కళాశాలలు, పాఠశాలల్లో శనివారం నిర్వహించిన గ్రూప్–4 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ప్రశ్న పత్రాలను పోలీస్‌లు బందోబస్తు మధ్య పరీక్ష కేంద్రాలకు తరలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాటు చేశారు. నిమిషం ఆలస్యమైన అనుమతించేది లేదని అధికారులు స్పష్టం చేయడంతో అభ్యర్థులంతా 15 నిమిషాల ముందే పరీక్ష కేంద్రాలకు చేరకున్నారు. పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరం పరీక్ష హాల్‌లోకి అనుమతించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటలకు వరకు మొదటి పేపర్, భోజన విరామం అనంతరం మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5గంటలకు రెండో పేపర్ పరీక్ష జరిగింది. ఏసీపీ శివరామయ్య, సీఐ పుల్యాల కిషన్, ఎస్ఐలు ప్రశాంత్‌బాబు, హరికృష్ణ, శివకృష్ణ పరీక్షకేంద్రాలను తనిఖీ చేస్తూ పోలీసు సిబ్బందిని అప్రమత్తం చేశారు. పేపర్ లీకేజీలతో పోటీ పరీక్షలు వాయిదా పడుతున్న తరుణంలో గ్రూప్4 పరీక్ష ప్రశాంతంగా జరుగటంతో అభ్యర్థులు సంతోషం వ్యక్తం చేశారు.

కమలాపూర్: మండలంలో శనివారం నిర్వహించిన గ్రూప్–4 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. గ్రూప్–4 పరీక్షల నిర్వాహణ కోసం మండలంలో నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాలలో 360 మందికి గాను 296 మంది అభ్యర్థులు, తెలంగాణ మోడల్ స్కూల్‌లో 288 మందికి గాను 222 మంది, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 192 మందికి గాను 150 మంది, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 144 మందికి గాను 113 మంది అభ్యర్థులు హాజరైనట్లు పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా 984 మందికి గాను 781 మంది అభ్యర్థులు పరీక్షలు రాయగా 203 మంది అభ్యర్థులు గైర్హాజరు అయినట్లు వెల్లడించారు. కాజీపేట ఏసీపీ శ్రీనివాస్, స్థానిక ఎస్సైలు పరీక్ష కేంద్రాలను సందర్శించి బందోబస్తు పరిశీలించారు. గ్రూప్–4 పరీక్ష ఉదయం 10 గంటలకు ప్రారంభమైనట్లు తెలిపారు. టీఎస్‌పీఎస్సీ నిబంధనల మేరకు 9.45కే గేట్లు మూసివేశామని, 9.47 గంటలకు ఓ మహిళా అభ్యర్థితో పాటు మరో పురుష అభ్యర్థి ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రానికి వచ్చినట్లు తెలిపారు. అప్పటికే గేట్లు మూసివేసిన పోలీసులు వారిద్దరిని పరీక్ష కేంద్రంలోకి అనుమతించకపోవడంతో అక్కడి నుంచే వెనుదిరిగారు.

దామెర: మండలంలోని ఒగ్లాపూర్ సమీపంలో గల కేర్ ఫార్మసీ కళాశాల, డిస్నీల్యాండ్ పాఠశాలలో శనివారం జరిగిన గ్రూప్–4 పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు చీఫ్ సూపరింటెండెంట్లు డాక్టర్ సుధీర్ కుమార్, రాకేష్‌భాను తెలిపారు. కేర్ ఫార్మసీ కళాశాలలో 192 మంది అభ్యర్థులకు గాను 153 మంది, డీస్నీ ల్యాండ్ పాఠశాలలో 480 మందికి గాను 398 మంది అభ్యర్థులు హాజరైనట్లు పేర్కొన్నారు. పరకాల ఏసీపీ జూపల్లి శివరామయ్య రెండు పరీక్షా కేంద్రాలను సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఎస్సై ముత్యం రాజేందర్, ఏఎస్సై రాజు ఆధ్వర్యంలో పోలీసులు అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

ఎల్కతుర్తి: మండల కేంద్రంలో శనివారం జరిగిన గ్రూప్–4 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మండలంలో ఏర్పాటు చేసిన మూడు పరీక్ష కేంద్రాల్లో గురుకుల పాఠశాల పరీక్ష కేంద్రంలో 432 మందికి 329 మంది పరీక్షకు హాజరు కాగా 103మంది గైర్హజరయ్యారు. మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రంలో 216 మందికి 167మంది హాజరు కాగా 49మంది గైర్హజరయ్యారు. కార్మెల్ కాన్వెట్ స్కూల్లో 240మందికి గాను 189 మంది హాజరు కాగా 51మంది గైర్హజరైనట్లు ఆయా పరీక్ష కేంద్రాల నిర్వహకులు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్ విధించి బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆత్మకూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన గ్రూప్–4 పరీక్ష సెంటర్‌లో శనివారం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. సెంటర్‌లో 168మంది అభ్యర్థులకు గాను 139 మంది హాజరుకాగా 29 మంది గైర్హజరు అయ్యారు. అలాగే మధ్యాహ్నం పరీక్షకు 137 మంది హాజరుకాగా 31 మంది గైర్హజరు అయినట్లు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ కృష్ణకుమారి తెలిపారు. స్థానిక ఎస్సై ప్రసాద్ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి పర్యవేక్షించారు.

శాయంపేట : శనివారం జరిగిన గ్రూప్ –4 పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు తికమక పడ్డారు. మండల కేంద్రంలోని నవోదయ ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. అయితే వరంగల్ ఉమ్మడి జిల్లాలో శాయంపేట గ్రామాలు మూడు ఉండడంతో పరీక్ష రాసే అభ్యర్థులు పరీక్ష కేంద్రాన్ని గుర్తించలేకపోయారు. హన్మకొండకు చెందిన సంద్రగిరి చైతన్య, ఉప్పల్ కమలాపూర్‌కు చెందిన తాళ్లపెల్లి సతీష్, రాయపర్తి మండలాలకు చెందిన వెలపు మహేందర్, కుమార్, రాచమల్ల శ్రీవాణిలకు శాయంపేట మండల కేంద్రానికి చెందిన నవోదయ పాఠశాల పరీక్ష కేంద్రం అలాట్ అయింది. విద్యార్థులు సందిగ్ధంలో హన్మకొండ పట్టణంలోని హంటర్ రోడ్డులో గల శాయంపేట పరీక్ష కేంద్రం వద్దకు వెళ్లారు. దీంతో అక్కడ హాల్‌టికెట్ నెంబర్‌లు కనిపించకపోగా వెంటనే శాయంపేట మండల కేంద్రంలోని నవోదయ పాఠశాలకు బయలుదేరారు. 35 కిలోమీటర్ దూరం ప్రయాణం చేసి పరీక్ష కేంద్రానికి చేరుకునే సరిగా పరీక్ష సమయం దాటిపోయింది. దీంతో పోలీసులు వారిని పరీక్ష కేంద్రంలోకి అనుమతించలేదు. పరీక్షా కేంద్రాన్ని గుర్తించడానికి సరైన ఏర్పాట్లు చేయడంలో అధికారులు విఫలమయ్యారని అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 35 కిలోమీటర్లు ప్రయాణం చేసి అతి కష్టం మీద పరీక్ష కేంద్రానికి రాగా ఆలస్యంగా వచ్చారని అనుమతించకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. పాఠశాలలో 120మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా కేవలం 77మంది విద్యార్థులు హజరైయ్యారు. పరీక్ష కేంద్రాన్ని పరకాల ఏసీపీ శివరామయ్య సందర్శించి భద్రత చర్యలు పరిశీలించారు. ఎస్సై ఇమ్మడి వీరభద్రరావు ఆధ్వర్యంలో భారీకేడ్లు ఏర్పాటుచేసి పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు చేశారు.

ఐనవోలు: గ్రూప్–4 పరీక్షల నిర్వహణకు మండలంలో ఏర్పాటు చేసిన మూడు కేంద్రాల్లో 860 మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా ఉదయం 190 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీకు 194 మంది అభ్యర్థులు గైర్హాజరు అయినట్లు అధికారులు తెలిపారు. జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ డెవలప్ మెంట్ ఆఫీసర్ ప్రేమలేఖ రెడ్డి మండలంలోని మూడు కేంద్రాలకు రూట్ ఆఫీసర్‌గా వ్యవహరించారు. లైజనింగ్ ఆఫీసర్లతో పాటు బందోబస్తులో ఏనుమాముల ఎస్సై శ్రీకాంత్, ఏఎస్సై, హెడ్ కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.



ఎల్కతుర్తి: అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీస్‌లు



దామెర: అభ్యర్థులను తనిఖీ చేస్తున్న ఎస్సై



ఆత్మకూరు: హాల్‌లోకి వెళ్తున్న అభ్యర్థులు



పరకాల: అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీస్‌లు

గిరిజనులపై మరిన్ని పరిశోధనలు చేయాలి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ రమేష్, తదితరులు

కేయూ క్యాంపస్: గిరిజనుల స్థితిగతులపై మరిన్ని పరిశోధనలు జరగాలని కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేష్ సూచించారు. కాకతీయ యూనివర్సిటీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ బొక్కయ్య రచించిన ఫారెస్ట్ అడ్మినిస్ట్రేషన్ ఇన్ షెడ్యూల్డ్ ఏరియా – ఇంపాక్ట్ ఆన్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ అనే పుస్తకాన్ని క్యాంపస్‌లోని అకాడమిక్ కమిటీ హాల్‌లో వీసీ రమేష్ శనివారం ఆవిష్కరించి మాట్లాడారు. గిరిజనుల జీవన విధానం, వారి వ్యవసాయ పద్ధతులు, విద్యా, ఆరోగ్యం, సంక్షేమం, సంస్కృతి, సంప్రదాయాలు, ఆహార అలవాట్లపై మరికొన్ని పరిశోధనలు జరగాలని కోరారు. పుస్తకావిష్కరణలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం అధిపతి ప్రొఫెసర్ యాదగిరిరావు, ప్రొఫెసర్ బొక్కయ్య, బుగ్గబాబు, ఆర్కిటెక్ట్ కోటి రాంబాబు, డాక్టర్ మంద వీరస్వామి, డాక్టర్ వేణుమాధవ్ పాల్గొన్నారు.

పేదలకు అండగా బీఆర్ఎస్



లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్న చీఫ్‌విప్

హన్మకొండ: నిరుపేదలకు బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా ఉంటోందని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని 19మంది లబ్ధిదారులకు రూ.14.20 లక్షల విలువైన చెక్కులను శనివారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందేందుకు ఆర్థిక స్తోమత లేని పేదలకు ప్రభుత్వం సీఎం సహాయ నిధి ద్వారా వైద్య ఖర్చులు చెల్లిస్తూ అండగా నిలుస్తోందని వివరించారు. పేదరికంలో ఉన్న వారు భయాందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సీఎం కేసీఆర్ దూరదృష్టితో ప్రతీ ఒక్క నిరుపేద కుటుంబానికి అండగా నిలిచే పథకాలకు శ్రీకారం చుట్టారని అన్నారు. కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, కార్పొరేటర్లు చెన్నం మధు, నర్సింగరావు, విజయలక్ష్మి, మానస, నాయకులు సతీష్, కేశవరెడ్డి, సంపత్ రెడ్డి, సురేందర్, రాంప్రసాద్ పాల్గొన్నారు.

ఉద్యోగులకు బదిలీ సహజం



వీడ్కోలు సమావేశంలో పాల్గొన్న వైద్య బృందం

దామెర: ఉద్యోగులకు బదిలీ సహజమని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మంజుల అన్నారు. ప్రతీ ఒక్క ఉద్యోగి పనిచేసిన చోటు మరోచోటుకి వెళ్లడం సహజమన్నారు. స్థానిక పీహెచ్‌సీ నుంచి బదిలీపై వెళ్లిన మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ శిరీష, డాక్టర్ కమల్ చంద్ నాయక్, ఫార్మసిస్టు శివకుమార్, సీనియర్ అసిస్టెంట్ రమేష్‌చారి. ఏఎన్ఎంలు శ్రీలత, సంధ్య, మంజులను శనివారం ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తిస్తూ ప్రతీ ఒక్కరితో కుటుంబ సభ్యులుగా మెదలడం అవసరమని అన్నారు. ఎన్ని రోజులు ఉద్యోగం చేశామన్నది ముఖ్యం కాదని, ప్రజలకు ఎంతమేర సేవ చేశామన్నదే ముఖ్యమన్నారు. డాక్టర్ ఉషారాణి, డాక్టర్ శాంతి, డాక్టర్ రుహానా, హెచ్‌ఈఓ అశోక్‌బాబు, ఆప్తాల్మిక్ ఆఫీసర్ ప్రకాష్, ఫార్మసిస్టు శరత్‌బాబు, సూపర్ వైజర్లు శ్రీకాంత్, భాగ్యలక్ష్మి, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

నీట్‌లో సత్తాచాటిన విద్యార్థినికి చేయూత



శృతికి చెక్కు అందిస్తున్న సీఎండీ గోపాల్‌రావు

హన్మకొండ: నీట్‌లో సత్తాచాటి ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న పేదంటి విద్యార్థినికి తెలంగాణ డిప్లొమా పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ చేయూతనందించి అండగా నిలిచింది. పాలకుర్తి మండలం గూడూరుకు చెందిన చెరిపల్లి శృతి నీట్‌లో మెరిట్ సాధించి వైద్యవిద్య అభ్యసించేందుకు అర్హత సాధించింది. అడ్మిషన్ చెల్లించే కనీస ఆర్థిక స్థోమత ఆ కుటుంబానికి లేదని తెలుసుకున్న తెలంగాణ పవర్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ డిస్కం ప్రధాన కార్యదర్శి నార్ల సుబ్రహ్మణ్యేశ్వర్‌రావు, అసోసియేషన్ నాయకులు స్పందించి రూ.50 వేల సహాయాన్ని చెక్కు రూపేనా టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్‌రావు చేతుల మీదుగా విద్యార్థి శృతికి అందించారు. అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మల్లికార్జున్, నాయకులు రాజు, జ్యోతిర్మయి, వీరేందర్, మురళీకృష్ణ, రాములు, శ్రీకాంత్, క్రాంతి, ప్రదీప్ పాల్గొన్నారు.

జర్నలిస్టులందరికీ ఒకే దఫాలో ఇళ్ల స్థలాలు



అల్లంతో సమావేశమైన సిక్స్ మెన్ కమిటీ సభ్యులు

నయీంనగర్: గ్రేటర్ వరంగల్ పరిధిలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన ఇళ్ల స్థలాల విషయంపై చర్చించేందుకు సిక్స్ మెన్ కమిటీ సభ్యులు మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణతో హైదరాబాద్ మీడియా అకాడమీ కార్యాలయంలో శనివారం సమావేశమయ్యారు. బ్యూరోలు, స్టాఫ్ రిపోర్టర్లు, ఫొటో వీడియో జర్నలిస్టులు, డెస్క్ జర్నలిస్టులతో ఏర్పాటు చేసిన సమావేశాల వివరాలను అల్లం నారాయణకు వివరించారు. రెండు హౌసింగ్ సొసైటీల్లో లేని జర్నలిస్టుల జాబితాను వెంటనే తయారు చేయాలని సిక్స్ మెన్ కమిటీకి ఆయన సూచించారు. విధి విధానాలను ప్రకటించి రెండు మూడు రోజుల్లోనే అర్హులైన వర్కింగ్ జర్నలిస్టుల జాబితాను రూపొందించి ప్రభుత్వానికి ఇవ్వాలని కోరారు. మీడియా అకాడమీ చైర్మన్‌ను కలిసిన వారిలో సిక్స్ మెన్ కమిటీ కన్వీనర్ బీఆర్.లెనిన్, సభ్యులు గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వేముల నాగరాజు, బి.సదయ్య, టీయూడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.దయాసాగర్, ఏకశిల హౌసింగ్ సొసైటీ సలహాదారు కే.అనిల్ కుమార్ ఉన్నారు.

‘అమ్మ’ వస్తోంది ఊరుకో నాన్న..



బాబును బుజ్జగిస్తున్న కిశోర్

శాయంపేట : శనివారం జరిగిన గ్రూప్–4 పరీక్షకు ఓ తల్లి తన 45 రోజుల బాబును తండ్రికి అప్పగించి పరీక్ష రాసేందుకు వెళ్లింది. హుజురాబాద్ పట్టణానికి చెందిన ముక్క నవ్య గ్రూప్–4 పరీక్ష రాసేందుకు మండల కేంద్రంలోని నవోదయ ఉన్నత పాఠశాలకు వచ్చింది. కుమారుడు దివ్యాన్ష్ కుమార్‌ను తన భర్త కిశోర్‌కు అప్పగించి వెళ్లింది. కొంత సమయం తరువాత బాబు దుఃఖిస్తుండగా ‘అమ్మ వస్తోంది ఊరుకో నాన్న’ అంటూ కిశోర్ బుజ్జగించాడు.

బీమా చెక్కు అందజేత



బీమా చెక్కు అందజేస్తున్న బ్యాంకు అధికారులు

ధర్మసాగర్: మండలంలోని కరుణాపురం గ్రామానికి చెందిన పసునూరి పూర్ణచందర్ (36) ఇటీవల ప్రమాదశాత్తు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడు ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంకులో ప్రమాద బీమా పథకంలో భాగంగా 699 రూపాయలు చెల్లించి 10 లక్షల బీమా పొంది ఉన్నారు. అయితే అతను రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో సదరు పేమెంట్ బ్యాంకు అధికారులు మృతుడి కుటుంబాన్ని సంప్రదించి వారికి రావాల్సిన రూ. 10 లక్షల ప్రమాద బీమా చెక్కును మృతుడి భార్య పసునూరి అనూషకు శనివారం అందచేశారు. ప్రతీ ఒక్కరు తక్కువ ప్రీమియంతో ప్రమాద బీమా సదుపాయం కలిగి ఉన్న ఎయిర్‌టెల్ ప్రమాద బీమాలో పాలసీ పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు చీఫ్ మేనేజర్ గూడూరు విజేందర్, జోనల్ మేనేజర్ శంకర్ లిక్కి, నర్సింగరావు, కస్టమర్ ఆఫీసర్ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

నేడు చెక్కుల పంపిణీ

ఆత్మకూరు: మండలంలోని వివిధ గ్రామాల చెందిన లబ్దిదారులకు ప్రభుత్వం నుంచి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను నేడు(ఆదివారం) ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పంపిణీ చేయనున్నట్లు బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కుమారస్వామి శనివారం ప్రకటనలో తెలిపారు. హనుమకొండలోని ఎమ్మెల్యే నివాసగృహంలో చెక్కులు పంపిణీ ఉంటుందని, లబ్దిదారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరుకావాలని ఆయన కోరారు.

సాయం అందించాలి

వరంగల్: ఎరుకల కులస్తులకు ప్రభుత్వం రూ.లక్ష చొప్పున సాయం అందించాలని ఎరుకల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోకిని రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేతిరి రాజశేఖర్ కోరారు. ఈమేరకు హైదరాబాద్‌లోని రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ రామచంద్ర నాయక్, జీసీసీ చైర్మన్ వాలియా నాయక్‌ను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ మార్చాలని రైతుల నిరసన



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద నిరసన చేస్తున్న రైతులు

కమలాపూర్: మండలంలోని కన్నూరు శివారులో ఇటీవల నూతనంగా ఏర్పాటు చేసిన బ్రిడ్జి కింద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను వేరే చోటుకు మార్చాలని రైతులు కోరారు. ఈ మేరకు రైతులు శనివారం ఆందోళన చెపట్టారు. అయితే బ్రిడ్జి కింద వ్యవసాయ అవసరాల కోసం 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. సాగునీరుకు ఏర్పాటు చేసిన టాన్స్‌ఫార్మర్‌ను మరో చోటుకు మార్చాలని స్థానిక రైతులు, సర్పంచ్ రాంచందర్‌రావు సంబంధిత క్రాంట్రాక్టర్‌ను కోరారు. తాను ఇప్పటికే నష్టాల్లో ఉన్నానని, దానిని తాను మరో చోటుకు మార్పించలేనని చెప్పడంతో విద్యుత్ శాఖ ఏఈ దృష్టికి తీసుకెళ్లారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను మరోచోటుకు మార్చేందుకు రూ.2 లక్షలు ఖర్చు అవుతుందని, అది కూడా ఏడీ ద్వారానే అవుతుందని ఆయన చెప్పినట్లు రైతులు తెలిపారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో పేద, దళిత, సన్న, చిన్నకారు రైతులకు చెందిన సుమారు వంద ఎకరాల వ్యవసాయ భూమి ఉందని, కరెంటు లేక ఇప్పటి వరకు వరి నార్లు కూడా పోసుకోలేదని రైతులు వాపోయారు. సంబంధిత కాంట్రాక్టర్, విద్యుత్ శాఖ, జిల్లా అధికారులు స్పందించి బ్రిడ్జి కింద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మరోచోటుకు మార్చాలని కోరారు. పంగసాగు చేయలేకపోతున్నామని, దాంతో తీవ్రంగా నష్టపోతున్నామని వాపోయారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై చైతన్య పర్చాలి



మాట్లాడుతున్న డాక్టర్ విజయ్‌చందర్‌రెడ్డి

పరకాల: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి చేరవేయాలని మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ విజయ్‌చందర్‌రెడ్డి, డాక్టర్ సిరంగి సంతోష్‌కుమార్‌లు పిలుపునిచ్చారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం జరిగిన మేరా బూత్ సబ్సే మజ్‌బూత్‌లో భాగంగా పరకాల, నడికూడ రెండు మండలాల ముఖ్యకార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ అధిక మెజార్టీతో గెలుపొంది కేంద్రంతో పాటు రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేయడంతో పాటు ప్రతీ ఇంటి గోడకు స్టిక్కర్లు అంటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుజ్జ సత్యనారయణరావు, శంకర్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ జయంత్‌లాల్, పట్టణ, నడికూడ మండల రూరల్ అధ్యక్షులు మార్త భిక్షపతి, పుట్ట రవీందర్, గోగుల రాజిరెడ్డి, ఇంచార్జి మేకల యాదగిరి, కౌన్సిలర్ భద్రయ్య, పట్టణ సీనియర్ నాయకులు దుబాసి వెంకటస్వామి, మార్త రాజభద్రయ్య, పురుషోత్తం పాల్గొన్నారు.

ఎల్కతుర్తిలో..

ఎల్కతుర్తి: బీజేపీ పాలనలోనే దేశాభివృద్ధి జరుగుతుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు పైడిపెల్లి పృథ్వీరాజ్ అన్నారు. భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి గ్రామంలో శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ కరుణాకర్ ఆధ్వర్యంలో బీజేపీ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. గ్రామాల్లో సీసీరోడ్లు, డంపింగ్ యార్డులు, ప్రతీ ఇంటికి మరుగుదొడ్డి, కరోనా వ్యాక్సిన్, పేదలకు ఉచితంగా రేషన్ బియ్యం, రైతులకు పెట్టుబడి సాయం, వ్యవసాయానికి ఫర్టిలైజర్ సబ్సిడీ తదితర పథకాలను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. బీజేపీ ప్రభుత్వం ప్రజలకోసం అహర్నిషలు కృషి చేస్తుందన్నారు. జిల్లా కార్యదర్శి కుమార్, ప్రకాశ్, శ్రీరామోజ్, శ్రీనివాస్, మ్యాకల రాజు, మీసా మహేష్, వేణు, సాయితేజ, శ్యామ్, నవీన్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర ధరల పెంపుపై నిరసన



మడికొండ: నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయంటూ కాజీపేట మండల కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు నీలం రజినీ ఆధ్వర్యంలో మడికొండ చౌరస్తాలో శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రజినీ మాట్లాడుతూ ధరల పెరుగుదలతో పేద, మధ్య తరగతి ప్రజలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.తొట్ల రాజుయాదవ్, లింగమూర్తి, మోహన్, వస్కుల శంకర్, రాంపూర్ గ్రామశాఖ అధ్యక్షుడు వేల్పుల భిక్షపతి, నాయకులు గుర్రం అమర్‌నాథ్, దువ్వ విజయ్, తిరుపతి, రాజు, కొప్పుల నవీన్‌యాదవ్, జిట్ట చంటి, పెనుకుల వినయ్ పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వరంగల్ అర్బన్:
9951602875 9505507575
9010299096 9553955722
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
వి.రాజ్‌కుమార్ (S.R) : 9966290903 (ఎల్కతుర్తి)
పి.చంద్రశేఖర్ (A.C.O) : 8074606274